శుభోదయ

www.dainamicnews.com

# డైనమిక్

dianamicnews Tv
dianamicnews.epaper.com

ప్రజల కోసం - ప్రగతి కోసం



విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.



డైనమిక్

CELL : 96523 03089



తెలంగాణ- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | వెల : 4/-


# సర్ పేరుతో కేంద్రం కుట్ర

- ఇప్పుడు గుజరాత్ వర్సెస్ దేశం: రేవంత్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరా
- తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ
- తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు
- రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యం



న్యూఢిల్లీ

అసెంబ్లీ కంటే జైలుకే ఎక్కువ సార్లు వెళ్లానంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'ప్రతిదిన్ కాంక్లేవ్'లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అనే అంశంపై ప్రసంగించిన ఆయన తన రాజకీయ ప్రయాణం, విద్యార్థి రాజకీయాలు, జాతీయ రాజకీయాలపై అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన 'ప్రతిదిన్' దినపత్రిక "భారత్ తదుపరి అధ్యాయం" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే

- మిగతా3లో

## 'సర్' వివాదం
## సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల విమర్శలు
- ఖర్గే వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా





## నేపాల్‌లో జలవిలయం..

- 6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- ఈ ఘోర విపత్తుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి
- వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు

## బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

- నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'
- రూ.60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు
- రూ.450 కోట్లతో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ



హైదరాబాద్

రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం'పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక

- మిగతా3లో

## భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం

- కానీ ఉపయోగించుకోలేకపోయాం: ఆస్ట్రేలియా ప్రధాని
- భారత్, ఆస్ట్రేలియా భాగస్వామ్యం మరింత పెరగాల్సి ఉందన్న అల్బనీస్
- ప్రధాని మోదీతో కలిసి సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్న ఆస్ట్రేలియా ప్రధాని
- డిసెంబరులో భారత్‌కు వ్యాపార ప్రతినిధి బృందంతో పర్యటన



## తెలంగాణ సీజేకు ప్రమోషన్

- ముగ్గురు జడ్జిలను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- మూడు రాష్ట్రాల హైకోర్టు సీజేలను సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతికి సిఫారసు
- తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ హైకోర్టు సీజేల పదోన్నతికి సిఫారసు
- నేటి సమావేశంలో సిఫారసుకు ఆమోదం తెలిపిన కొలీజియం




## ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ.. గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ

- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు

## బీజేపీ చేతిలో కీలుబొమ్మలా సీఈసీ



- వరుసగా కేంద్రంలో బీజేపీ మూడు పర్యాయాలు అధికారంలోకి రావడానికి కేంద్ర ఎన్నికల సంఘం పాత్ర ఉంది
- వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నచోట్ల ఓట్ల తొలగింపునకు యత్నం
- కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘంలో పని చేసే అధికారులే ఓట్ల తొలగింపునకు కారణం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వనపర్తి

కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ బీజేపీ చేతిలో కీలుబొమ్మగా మారి కాంగ్రెస్ అనుబంధ ఓటర్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లను ఉద్దేశ పూర్వకంగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఏఐసీసీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కలెక్టరేట్ ఎదుట డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పొంగులేటితో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, కసిరెడ్డి

- మిగతా3లో



## హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం

- హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం
- అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి వార్నింగ్
- త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతాం
- హర్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయి

# 1.41 కోట్ల మంది ఓటర్లు పాస్

- 2.64 కోట్ల మందికిగాను ఇప్పటివరకు 1.41 కోట్ల మంది అర్హులుగా నిర్ధారణ
- 59,51,696 మంది ఓటర్ల విచారణ పూర్తి.. విచారణకు రాని 31,01,407 మంది ఓటర్లు
- కొత్త ఓటర్ల నమోదుకు 4.43 లక్షలు.. ఓటర్ల తొలగింపునకు 30,676 దరఖాస్తులు



హైదరాబాద్

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (సర్)-2026లో భాగంగా నవంబర్ 9న ప్రచురించే తుది ఓటర్ల జాబితా తయారీ కోసం ఎన్నికల సంఘం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఈ జాబితాలో చోటు పొందేందుకు సోమవారం నాటికి మొత్తం 1,41,02,982 మంది ఓటర్లు అర్హత సాధించారు. సర్--2026 ప్రక్రియకు ముందు మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా గత నెల 17న ప్రకటించిన ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,64,87,213కు తగ్గిపోయింది. ఆచూకీ లేరు/శాశ్వతంగా నివాసం మారారు/చనిపోయారు/మరో చోట ఓటుకలిగి ఉన్నారు (ఏఎస్‌డీడీ) అనే కారణాలతో 73,39235 మంది (21.7 శాతం) ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి

- మిగతా3లో

# ఎన్నికల సంఘం సర్ ప్రక్రియ లో అవకతవకలకు నిరసనగా మేడ్చల్ లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 28 శుభోదయ డైనమిక్:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు మేడ్చల్ లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, ప్రత్యేక తీవ్రత సవరణ( సర్) ప్రక్రియలో అవకతవకలకు వ్యతిరేకంగా ఈ ఆందోళన చేపట్టారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించారు.

మేడ్చల్. చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీ మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల రక్షణ, ఎన్నికల ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత కోసం కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డిసిసి కమిటీ సభ్యులు ముత్యం రెడ్డి, మేకల యల్లయ్య, మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మా రెడ్డి, రషీద్ బేగ్, కృష్ణ గౌడ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్ డివిజన్ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, ఆర్కల విజయ్ గౌడ్, వరగాని వాసు, జలీల్ ఖాన్, రాజు చారి, చందు ముదిరాజ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఓటర్ల హక్కులను కాపాడేందుకు, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎన్నికల సంఘం తక్షణమే పారదర్శక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.



## 'సర్' వివాదం
# సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్





ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, సర్, ఈసీ వ్యవహారంపై కాంగ్రెస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. మరోవైపు కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రతిపక్ష ఆరోపణలను ఖండిస్తూ, ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. 'సర్' వివాదం ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదని, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన విషయమని ఖర్గే పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ ఈ అంశాన్ని తీవ్రంగా తీసుకుంటుందని చెప్పారు. సర్ అంశంపై చర్చించేందుకు మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇక జ్ఞానేశ్ కుమార్ బీజేపీ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని, ఆ పార్టీ కార్యకర్తగా మారారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### జైరాం రమేశ్ విమర్శలు

సర్ ప్రక్రియలో పౌరసత్వానికి సంబంధించిన అంశాలను పరిశీలించే విధానం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తిరిగి బలోపేతం చేసే సుదీర్ఘ ప్రక్రియలో తొలి అడుగు సీఈసీ రాజీనామాతోనే ప్రారంభం కావాలని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా ఓ ఇంటర్వ్యూలో ఇచ్చిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ఓటరు దేశ పౌరుడై ఉండాల్సిందేనని, అయితే పౌరసత్వాన్ని నిర్ణయించడం ఎన్నికల సంఘం బాధ్యత కాదని చెప్పినట్లు తెలిపారు. పౌరసత్వానికి సంబంధించి విస్తృతమైన షరతులు విధించడంపైనా ఆయన ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. భారత పౌరసత్వం 1955 పౌరసత్వ చట్టం పరిధిలోకి వస్తుందని, పార్లమెంట్ కాలానుగుణంగా చేసిన సవరణలకు అనుగుణంగా ఈ చట్టం అమలులో ఉంటుందని చెప్పారు.

### ఖర్గే వ్యాఖ్యలకు నడ్డా కౌంటర్

కాంగ్రెస్ విమర్శళకు కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈసీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఈసీ ఇప్పటికే తమ వివరణ ఇచ్చిందని, అయినప్పటికీ ప్రతిపక్ష నేతలు అదే ఆరోపణలను కొనసాగిస్తున్నాయని విమర్శించారు. లోక్?సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తదితర ప్రతిపక్ష నేతలు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల కంటే ఆరోపణలు, గందరగోళానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర సంస్థలపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారిందని ఆరోపించారు. రాహుల్ గాంధీని ఉద్దేశించి ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన అది నిజం కాదని తెలిపారు. ఈసీ ఇచ్చిన వివరణల తర్వాత కూడా ప్రతిపక్షాలు ఆరోపణలు కొనసాగిస్తున్నాయని విమర్శించారు.

సర్, ఓటర్ల జాబితాకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పలు కథనాలు వెలువడ్డాయి. ఫారం-6, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు సంబంధించిన అంశాలపై ఈ అభ్యంతరాలు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఈ అభిప్రాయాలు నిర్ణయాత్మక దశకు ముందు జరిగే సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమని తెలిపింది. తుది నిర్ణయాలు మాత్రం ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు పేర్కొంది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్? రాజీనామా చేయాలని కాంగ్రెస్?తో పాటు సీపీఐ, సీపీఐ(ఎం), టీఎంసీ, శివసేన(యూబీటీ) వంటి ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయనపై అభిశంసనకు కూడా సిద్ధమయ్యాయి.

# 'హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం



హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయని ప్రశంసించారు. యుద్ధం, చర్చల్లో ఏదొకటి తేల్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ తేల్చిచెప్పింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ చేసిన ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన వేళ ఇరాన్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మరో దఫా దాడులకు సిద్ధమని ఇరు దేశాలు ప్రకటించడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ క్రమంలోనే హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం పంపారు. హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను అరేబియా సముద్రం వైపు తరిమికొట్టినట్లు ఖమేనీ తెలిపారు. త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో తమ సైనికుల చేతిలో చావు దెబ్బ తిన్న శత్రువులు, అరేబియా సముద్రం దాటి ముందుకు రావడానికి సాహసించడం లేదన్నారు. ఇరాన్‌పై దాడులకు దిగిన ప్రతిసారి శత్రువులు భారీ నష్టాన్ని మూటగట్టుకున్నారని పేర్కొన్నారు. "ఇరాన్?లోని రెండు దక్షిణ సముద్రాలు శత్రు బలగాలు సంచరించే ప్రదేశాలుగా ఉండేవి. అయితే, హర్మూజ్ జలసంధిలో ధైర్యవంతులైన ఇరాన్? యోధుల నుంచి వారు పొందిన ఎదురుదెబ్బల కారణంగా అరేబియా సముద్రాన్ని దాటి ముందుకు రావడం లేదు. వారు ఈ వైపునకు వచ్చి, తమకు తామే హానిని తెచ్చుకున్నారు. త్వరలోనే అరేబియా సముద్రం కూడా వారి నుంచి విముక్తి పొందుతోంది. మనల్ని బలహీనపరచడానికి శత్రువులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. కానీ ఇప్పుడు సమాజంలోని వివిధ వర్గాల మధ్య స్పష్టమైన విభేదాలు ఉన్నప్పటికీ, పవిత్రమైన హర్మూజ్ జలసంధి పరిరక్షణతో సహా తమ హక్కులను నిలబెట్టుకోవడంలో దృఢంగా నిలబడుతున్నారు." అటు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు తాము చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించగా ఇరాన్ దీటుగా స్పందించింది. అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించారు. అవసరమైతే అంతిమ యుద్ధానికి కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. అదే సమయంలో శాంతి చర్చలకు సిద్ధమని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఏది కావాలో ట్రంప్ తేల్చుకోవాలని అన్నారు. శాంతి కోసమే తాము న్యూయార్క్ వెళ్లామని కాళ్లబేరానికి కాదని అరాగ్చీ వెల్లడించారు. జప్తు చేసిన తమ ఆస్తులు, నిధులను విడుదల చేస్తే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని పునరుద్ఘాటించారు. అయితే, ఇరాన్ ప్రతిపాదనను తిరస్కరించడానికి కొన్ని కారణాలున్నాయని ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్జ్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడి చేసి, అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని మండిపడ్డారు. అందుకే వారిపై తమకు నమ్మకం లేదని అన్నారు. ఇరాన్ అణు ముప్పు నుంచి ప్రపంచాన్ని రక్షించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారని మైక్ వాల్జ్ వెల్లడించారు. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అతి త్వరలోనే అమెరికా విజయం సాధిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై సైనిక దాడులు జరిగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. యుద్ధాన్ని తాము గెలిచిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు భారీగా పడిపోతాయన్నారు. ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్‌పై మాట్లాడిన ట్రంప్, సైనిక, ఆర్థిక మార్గాల ద్వారా తాము విజయం సాధిస్తామన్నారు. మిలిటరీ పరంగా తాము ఇప్పటికే గెలిచామని, ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందన్నారు. వారి కరెన్సీకి విలువ లేకుండా పోయిందని ఇరాన్‌లో ద్రవ్యోల్బణం దాదాపు 300 నుంచి 318 శాతానికి చేరుకుందన్నారు. అమెరికా నేవీ దిగ్బంధనంతో పోర్టుల ద్వారా ఎగుమతులు నిలిచిపోవడంతో ఇరాన్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. పొరుగు దేశాల నుంచి సరకులను ఎగుమతి చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్- తుర్కియే సరిహద్దు వద్ద కొన్ని కిలోమీటర్ల మేర

## స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు భరోసా




**మిర్యాలగూడ, శుభోదయ డైనమిక్ వార్త** రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ కార్డులు, 3.48 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.15 వేల కోట్ల వ్యయంతో ఉచితంగా 6 కిలోల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలో ఎస్వీ గార్డెన్స్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రస్తుతం 1,00,526 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నాయని, 2,98,590 మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పెండింగ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేస్తామని, జూన్ 2028 నాటికి ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు.అర్హత ఉన్న గ్రామాలకు చౌకధర దుకాణాలు మంజూరు చేస్తామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. మిర్యాలగూడ ఫ్లైఓవర్, బస్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ బి. చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

ఎస్పీ నరసింహ



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ ఐపీఎస్ స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలను చట్టపరిధిలో సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

## భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి పాఠం



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** నేటి యువతకు భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. సోమవారం నేరేడుచర్లలో సీపీఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన భగత్ సింగ్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు.దేశం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగాలు యువతకు ఆదర్శమన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించి, సమాజ మార్పు కోసం పోరాడే స్ఫూర్తిని యువత అలవర్చుకోవాలని సూచించారు. భగత్ సింగ్ ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.కార్యక్రమంలో కొదమగుండ్ల నగేష్, రాపోలు నవీన్, యడవల్లి అరుణ్, సిరికొండ శీను, ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవిందు గౌడ్, కొమరాజు వెంకట్, నీలా రామ్మూర్తి, పిల్లలమర్రి పుల్లారావు, వాడాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ బోధనపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం

జడ్పీహెచ్ఎస్ నడిగూడెంలో యూపీ లెవెల్ హిందీ కాంప్లెక్స్ సమావేశం




**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్తా, సెప్టెంబర్ 28** సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ నడిగూడెం పాఠశాలలో సోమవారం యూపీ లెవెల్ హిందీ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. శ్రీదేవి అధ్యక్షత వహించి పాఠశాలల్లో హిందీ బోధన తీరును తెలుసుకుని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి వనం సత్యనారాయణ మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఎం.డి. మౌలానా, ఎస్.కె. రంజాన్ బేగం ఆర్పీలుగా వ్యవహరించారు.సమావేశంలో ఉపాధ్యాయులు రూపొందించి తీసుకువచ్చిన లిటీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)లిను ఎంఈఓ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. విద్యార్థులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులు రూపొందించిన టీఎల్ఎంలను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాజిదా, నిర్మల, పర్వీన్, రాజశేఖర్ హిందీ ఉపాధ్యాయులను కాంప్లెక్స్ సమావేశంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపా

# గుడిసెల్లో జీవిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి శివకుమార్



**శుభోదయ డైనమిక్-నేరేడుచర్ల** గుడిసెలు వేసుకొని జీవిస్తున్న నిరుపేదలకు న్యాయం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. నేరేడుచర్ల పట్టణ పరిధిలోని సర్వే నంబర్లు 243, 244లో 2018 నుంచి గుడిసెలు వేసుకొని జీవిస్తున్న నిరుపేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారికి శాశ్వత నివాస హక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు అఖిల్ కుమార్, వాసపల్లయ్య, హుజూర్‌నగర్ డివిజన్ కార్యదర్శి సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, రజాక్, లక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 6న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్టోబర్ 6న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయడానికి నేరేడుచర్లలోని పలు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎంఎస్‌ఎఫ్ నేరేడుచర్ల మండల కమిటీని ఏర్పాటు చేసి, ఎమ్మార్పీఎస్ ఉద్యమం సాధించిన ఫలితాలను విద్యార్థులకు వివరించారు. సూర్యాపేట జిల్లా ఎంఎస్‌ఎఫ్ ఇన్‌చార్జి పందిటి నవీన్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్ మాదిగ, సీనియర్ నాయకులు కుర్రి వెంకన్న మాదిగ, ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు ఉబ్బపెల్లి శ్యామ్ మాదిగతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్ వార్త** ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా, మండల స్థాయిలో వచ్చే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, పెండింగ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 90 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో భూ, రెవెన్యూ సమస్యలకు 52, డీపీఓకు 5, డీఎంహెచ్‌ఓకు 4, డీడబ్ల్యూఓకు 3, ఇతర శాఖలకు 26 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఆర్ అండ్ బీ శాఖలో కారుణ్య నియామకంపై సస్పెన్షన్



**శుభోదయ డైనమిక్ -- సూర్యాపేట బ్యూరో** కారుణ్య నియామకం కోసం డబ్బులు డిమాండ్ చేసి, అక్రమంగా మరో వ్యక్తికి పోస్టింగ్ ఇచ్చారన్న ఫిర్యాదుపై ఆర్ అండ్ బీ శాఖ జూనియర్ అసిస్టెంట్ శ్రీరామ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సస్పెండ్ చేశారు. 2023లో గుండెపోటుతో మృతి చెందిన వాచ్‌మెన్ మండపల్లి భరత్‌బాబు కుమారుడికి రావాల్సిన కారుణ్య నియామకంలో డబ్బులు డిమాండ్ చేశారని బాధితుడు కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ సస్పెన్షన్‌తో పాటు సమగ్ర విచారణకు ఆదేశించారు. వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే అంశంపై అదనపు కలెక్టర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, ఆడిట్ ఆఫీసర్‌లతో విచారణ కమిటీని ఏర్పాటు చేసి, తక్షణమే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# కూకట్ పల్లి రామ్‌దేవ్‌రావు ఆసుపత్రిలో సెప్టెంబర్ 29న వాకథాన్, ఉచిత హృదయ ఆరోగ్య శిబిరం




**మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 28 శుభోదయ డైనమిక్:** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లిలో రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సహకారంతో సెప్టెంబర్ 29, మంగళవారం ఉదయం 6 గంటల నుంచి వాకథాన్‌తో పాటు ఉచిత హృదయ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎన్. యోబు పిలుపునిచ్చారు. హృదయ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడం, గుండె సంబంధిత వ్యాధులపై ముందస్తు గుర్తింపును ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రముఖ రేకీ థెరపిస్ట్, రచయిత, కుటుంబ కౌన్సెలర్ లక్ష్మీ కమలాకర్ జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించనున్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరగనుండగా, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్. ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో వాకథాన్, కార్డియాక్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఉచిత హృదయ ఆరోగ్య శిబిరంలో రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్ష, రక్తపోటు పరీక్ష, ఈసీజీ, 2ఇ ఎకో స్క్రీనింగ్, అలాగే కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్. ప్రదీప్ రెడ్డితో నిపుణుల వైద్య సంప్రదింపులు ఉచితంగా అందించనున్నారు. స్క్రీనింగ్ అనంతరం అవసరమని వైద్యులు సూచించే తదుపరి వైద్య ప్రక్రియలపై 10 శాతం రాయితీ కూడా అందిస్తున్నట్లు ఆసుపత్రి ప్రకటించింది. "చర్య కోసం హృదయాన్ని ఉపయోగించండి---ఒక్క హృదయ స్పందనను కూడా నిర్లక్ష్యం చేయవద్దు!" అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా కార్యక్రమం కొనసాగనుంది. ఉచిత ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రజలు ఉదయాన్నే ఆసుపత్రి ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం

చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్** :గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ--1 కేంద్రంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు, రాయినిగూడెం సర్పంచ్ రామంజి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని నిర్వాహకులు తెలిపారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదలను ప్రోత్సహించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషకాలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని వివరించారు. పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. "పౌష్టికాహారం -- ఆరోగ్యకరమైన బాల్యం -- బలమైన భవిష్యత్తు" అనే సందేశంతో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సునీత, అంగన్వాడీ టీచర్లు చంద్రకళ, నాగమణి, రాయినిగూడెం డాక్టర్ సుష్మ, ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్ల మండల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ

**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల మండల ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 8 దరఖాస్తులు అందినట్లు ఎంపీవో నాగరాజు తెలిపారు. శాఖల వారీగా రెవెన్యూ శాఖకు 5, హౌసింగ్ శాఖకు 2, ఇరిగేషన్ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన 21 మంది అధికారులు పాల్గొన్నట్లు ఎంపీవో నాగరాజు తెలిపారు.

# నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా మాక్ పార్లమెంట్

ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ విధానాలపై విద్యార్థులకు అవగాహన






**శుభోదయ డైనమిక్ -- నేరేడుచర్ల** పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ నేరేడుచర్లలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, వివిధ శాఖల మంత్రులు, ప్రతిపక్ష నాయకులు, సభ్యుల పాత్రలను సమర్థవంతంగా పోషించారు. పార్లమెంట్ సమావేశాలు ఎలా జరుగుతాయి, పరిపాలన, శాసన ప్రక్రియలు, సభా నియమ నిబంధనలు తదితర అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చలు, ప్రశ్నలు, సమాధానాలు, నిర్ణయ ప్రక్రియలను మాక్ పార్లమెంట్ ద్వారా ఆచరణాత్మకంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, పరిపాలనా విధానాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. సభా నియమాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వ్యవహారశైలిని విద్యార్థులు అలవర్చుకోవడానికి మాక్ పార్లమెంట్ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జానయ్య విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ ఖాన్, నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, భానుమతి, మాధవి, రాంమూర్తి, బికోజి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావుతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నిజ దేవుడు యేసు క్రీస్తు మినిస్ట్రీస్ లో రక్షణ పండుగ వేడుకలు

యేసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి రక్షణ కల్పిస్తాయి

నిజ దేవుడు యేసు క్రీస్తు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ థామస్





**శుభోదయ డైనమిక్ న్యూస్, సెప్టెంబర్ 28, సూర్యాపేట** : భీమవరం గ్రామంలోని స్థానిక నిజ దేవుడు యేసుక్రీస్తు మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో రక్షణ పండుగ (మారుమనస్సు వేడుక) సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలకు వివిధ చర్చిల నుండి చుట్టుపట్టు వివిధ గ్రామాల, పట్టణాల నుండి ప్రజలు విశ్వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు ఈ సందర్భంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ తామస్ గారు మాట్లాడుతూ యేసుక్రీస్తు త్యాగమే ప్రపంచ మానవాళికి రక్షణ గా నిలిచిందని ప్రపంచ శాంతి కొరకై ప్రభువు కష్టాలు పడి ప్రజల కోసం తాను భూమి మీదకు వచ్చి వారిని రక్షించుటకై సిలువలో ప్రాణం అర్పించాడని తెలియజేశారు ప్రభు కోసం ఆధ్యాత్మిక జీవితంలో అందరం ఎదగాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ప్రజలకు భారీ అన్న వితరణ నిర్వహించారు. చర్చిలో మహిళలు ప్రభువు కీర్తనలు చాలా చక్కగా ఆలపించారు చర్చిలోని డెకరేషన్ లైటింగ్స్ చక్కగా అలరించాయి.

# ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి రామారావు గౌడ్ విజ్ఞప్తి



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్ రూరల్** నల్గొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ కోరారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి బయోడేటా అందజేశారు. మూడు దశాబ్దాలుగా విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పనిచేశానని, జర్నలిస్టుగా, హైకోర్టు న్యాయవాదిగా, సుప్రీంకోర్టు ఎన్‌రోల్డ్ అడ్వకేట్‌గా సేవలందిస్తున్నానని రామారావు గౌడ్ తెలిపారు. సామాజిక, వామపక్ష ఉద్యమాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదు సత్యం గౌడ్ పాల్గొన్నారు.

# 4వ వార్డులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కోదాడ,-- శుభోదయ డైనమిక్ వార్త** కోదాడ పట్టణంలోని గాంధీనగర్ 34వ వార్డుకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. 34వ వార్డుకు చెందిన చీమ నరసయ్యకు రూ. 56,000, కలకొండ వెంకటేశ్వర్లుకు రూ. 25,500, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లుకు రూ. 20,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్, ఫ్లోర్ లీడర్లు, 34వ వార్డు కౌన్సిలర్ గంధం బాలేంద్ర పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభం.

పితృ మహాలయ పక్షాల సందర్భంగా 15 రోజుల పాటు నిత్యాన్నదానం.....

అన్నదానం పుణ్యకార్యం మున్సిపల్ కమిషనర్



**కోదాడ శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 28** అన్నదానం పుణ్యకార్యమని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. సోమవారం కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రంగా థియేటర్ లో పితృ మహాలయ పక్షాల సందర్భంగా ఏర్పాటు చేసిన 15 రోజుల అన్నదాన కార్యక్రమన్ని ఆమెముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మొదటి రోజు అన్నదాన దాతగా గాదంశెట్టి అశ్వర్ధనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గాదంశెట్టి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ నేటి నుండి 15 రోజుల పాటు పితృ పక్షాల సందర్భంగా పేదలకు నిరంతరం అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పైడిమర్రి సత్తిబాబు, పైడిమర్రి నారాయణరావు, పందిరి సత్యనారాయణ, గరినే ఉమా, శ్రీధర్, చల్లా ప్రకాష్, ఇరుకుల్లా చెన్నకేశవరావు, కొత్తూరు శ్రీను, శంకర్, సాయి, చీదెళ్ల హనుమంతరావు, వెంపటి ప్రసాద్, పైడిమర్రి రామారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA